

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

సోమవారం | 6 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 9


# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

- మహనీయుల ఆశయాలను తూ.చా. తప్పకుండా పాటించాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని, మహనీయుల ఆశాలను నిరంతరం తూచా తప్పకుండా పాటించడమే వారికి మనమిచ్చే గొప్ప గౌరవమని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర అన్నారు. ఆదివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

మిగతా 2 లో...



# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం..

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05, (ప్రజాజ్యోతి):** హనుమకొండ లోని అంబేద్కర్ భవన్‌లో భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, సమతా వాది డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను సాకారం చేసేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన పార్లమెంట్‌లో దళితుల సమస్యలపై నిరంతరం గళమెత్తి, సుమారు 34 ఏళ్లపాటు ఉప ప్రధానిగా, కేబినెట్ మంత్రిగా సేవలందించిన మహానేత అని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ రూపొందించిన 2025–26 వార్షిక ఎస్సీ ప్రణాళికను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ కుమార్తె మీరా కుమారి లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. హనుమకొండలో

మిగతా 2 లో...

# హనుమకొండలో హ్యాపీ సండే

- జీవితంలో యోగా సాధన ఎంతో అవసరం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05, (ప్రజాజ్యోతి):** ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్స్‌లో నెరేళ్ల వేణుమాధవ ఆడిటోరియంలో "హ్యాపీ సండే" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరై యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రోజువారీ జీవితంలో యోగా సాధన ఎంతో అవసరమని, ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టి యోగా వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ సిహెచ్ఓ రాజిరెడ్డి, ఉప కమిషనర్ సమ్మయ్య, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ గోపాల్ రెడ్డి, కంది శ్రీనివాస రెడ్డి, యోగా గురువు హనుమంతు, వాకర్లు, సైకిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు

మిగతా 2 లో...



# హరితహారం చెట్లకు... విద్యుత్ షాక్..!

- సబ్ స్టేషన్ పనుల పేరుతో చెట్ల నరికివేత..

**పర్వతగిరి, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని జమాల్‌పురం క్రీడా ప్రాంగణం పరిసరాల్లో నూతనంగా నిర్మించనున్న సబ్ స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటిన హరితహారం చెట్లను విచక్షణ రహితంగా నరుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జమాల్‌పురం క్రీడా ప్రాంగణం నుంచి గుంటూర్ పల్లి, తండా క్రాస్ రోడ్ వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్ల మధ్యలోనే విద్యుత్ స్తంభాలు నాటుతూ, వాటికి అడ్డంగా ఉన్న చెట్లను భారీగా తొలగిస్తున్నట్లు సమాచారం. అదనంగా, పాత విద్యుత్ స్తంభాలకు పక్కనే వేయాల్సిన కొత్త స్తంభాలను సుమారు 10–12 అడుగుల దూరంలో ఏర్పాటు చేయడం వల్ల అవసరంలేని విధంగా మరిన్ని చెట్లు నష్టపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం

మిగతా 2 లో...

## హరితహారం చెట్లకు విద్యుత్ షాక్..!

(మొదటి పేజీ తరువాయి...)



కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన హరితహారం కార్యక్రమం లక్ష్యాలను ఈ చర్యలు ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్లను కాపాడే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. చెట్ల నరికివేతకు సంబంధించి అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారా అనే అంశంపై స్పష్టత లేకపోవడం గమనార్హం. స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులు కూడా ఇప్పటివరకు స్పందించలేదు. చెట్ల నరికివేత జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు అనుమతులు, పర్యావరణ నిబంధనలు పాటించారా అనే అంశాలపై ప్రజలు సమాధానం కోరుతున్నారు. చెట్ల నరికివేతను వెంటనే నిలిపివేయాలి, జరిగిన నష్టంపై పూర్తి స్థాయి విచారణ జరపాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి, విద్యుత్ సదుపాయాల విస్తరణ అవసరమే అయినప్పటికీ, పర్యావరణ పరిరక్షణను విస్మరించకూడదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



(మొదటి పేజీ తరువాయి...)

శ్రమించిన మహనీయుడు, సంఘసంస్కర్త, సామాజిక చైతన్యానికి ప్రతీక, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమానత్వం మరియు సామాజిక న్యాయం సాధన కోసం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం దేశానికి శాశ్వత ప్రేరణగా నిలిచిందని తెలిపారు. అలాగే, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్,ఆర్ఐ అడ్మిన్ రత్నం,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నారావుపేటలో గుట్కా, గుడుంబా విక్రేతలపై కేసు నమోదు

**చెన్నారావుపేట, ఏప్రిల్ 5( ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో నిషేధిత గుట్కా, గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తులపై పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మేకల నిర్మల కిరణం షాపులో ప్రభుత్వ నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో ఎస్సై రాజేష్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణమూర్తితో కలిసి సదరు షాపులో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా అంబర్ గుట్కా ప్యాకెట్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని, విక్రేతపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.మండలంలోని కోనాపురం గ్రామంలో చెరుకుపల్లి కోమాల అనే వ్యక్తి గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి మెరుపు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో గుడుంబా నిల్వలు దొరకడంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మండలంలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ రెడ్డి హెచ్చరించారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం





(మొదటి పేజీ తరువాయి...)

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రతిష్ట కోసం భూమిపూజ చేయడం సంతోషకరమని, వచ్చే ఏడాది విగ్రహాన్ని ఏర్పాటు చేసి జయంతిని మరింత ఘనంగా నిర్వహిద్దామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరియు కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థుల మధ్య ఉన్న అసమానతలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల పరిస్థితులను పరిశీలించి మెరుగుదలకు కృషిచేయాలని సూచించారు. అసైన్డ్ భూముల విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని హెచ్చరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ చేయడం తనకు గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఆయన ఆశయ



సాధన కోసం కృషిచేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను అధిగమించి ఉప ప్రధానిగా ఎదిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దాదాపు 30 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యునిగా, రక్షణ, వ్యవసాయ తదితర శాఖల మంత్రిగా దేశానికి విశిష్ట సేవలందించినట్లు గుర్తుచేశారు. దళితుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్యకోసం రూ.20లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్ తదితరులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

- సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్



**కొడకండ్ల, ఏప్రిల్ 04 ( ప్రజాజ్యోతి ):** భారత మాజీ ఉపప్రధాని బాబు జాగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి అని కొడకండ్ల గ్రామ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కార్మికులు , కర్షకుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ ఎం.డి. షన్న, వార్డ్ సభ్యులు స్వప్న వెంకన్న, ఎదుల నవీన్, ప్రేమలత ధర్మేందర్, అండాలు వెంకన్న , ఫీల్డ్ అసిస్టెంట్ జంగిలి సురేష్ తదితరు లు పాల్గొన్నారు.

## సొసైటీ ఆధ్వర్యంలో అంబెడ్కర్ జీవిత చరిత్ర గ్రంథాలు పంపిణీ.!



**ప్రజాజ్యోతి–మల్హార్ రావు.ఏప్రిల్ 05** బాబు జగ్జివన్ రాం జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ 542 వ్యవస్థాపకులు లింగమల్ల జ్యోతి–శంకరయ్య ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత,బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ జీవిత చరిత్ర గ్రంథాలను ఆదివారం తెలంగాణ ఉద్యమకారుడు సలేంద్ర రాజన్న యాదవ్ తోపాటు పలువురికి పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, మహానుభావుల జీవిత చరిత్ర గ్రంథాలు పంపిణీ, వారి జయంతి,వర్ధంతి వేడుకలు నిర్వహించడమే సొసైటీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కాళేశ్వరం జోనల్ యూత్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్,ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



(మొదటి పేజీ తరువాయి...)

119జయంతి ఉత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సమత వాది, కార్మిక చట్టాలఆద్యుడు గా దేశానికి చేసిన సేవలను ఆయన చేసిన కృషిని కొనియాడారు.ఆయన ప్రస్థానం భావితరాలకుఎంతో స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. మహానుభావుల ఆశలను నిరంతరం చిత్తశుద్ధి తో పాటిస్తూ వాటి అమలు కోసం కృషి చేయడంద్వారానే వారికి నిజమైన కీర్తిగడించినట్లు అవుతుందని అన్నారు. భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో అలుపెరుగని పోరాటంచేసిన మహోన్నత వ్యక్తిగా, అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు.కేంద్ర కార్మికమంత్రిగా అనేక కార్మిక సంక్షేమ విధానాలకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ములుగు మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి మాట్లాడుతూ..డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన కృషిని గుర్తు చేస్తూ వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి కొమురయ్య, తహశీల్దార్ విజయ భాస్కర్,జన్నురవి, నెమలి నర్సయ్య, మడిపెల్లి శ్యాం, బుర్రి సతీష్, కాడపాక శ్యాం, ల్యాదెళ్ళ అశోక్, ముంజాల బిక్షపతి గౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా రేషన్ బియ్యం రవాణా





- ఇద్దరిపై కేసు నమోదు

**హసన్‌పర్తి,ఏప్రిల్ 5(ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి మండలంలోని కేయు పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం రవాణా చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 4వ తేదీ రాత్రి పహారా నిర్వహిస్తున్న ఎస్సై కళ్యాణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి భీమారం ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పద కదలికలు గమనించారు.రాత్రి మూడుగంటల సమయంలో భీమారం గ్రామంలోని మసీదు సమీపానికి చేరుకోగా, ఒక ఇంటి ఎదుట నిలిపిన వాహనంలో బియ్యం బస్తాలను లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను ముల్కనూరు గ్రామానికి చెందిన తూర్పాటి తిరుపతి అని తేలింది.విచారణలో భాగంగా, రేషన్ దుకాణం నిర్వాహకురాలు గడ్డం భాగ్యలక్ష్మి వద్ద నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు అతడు అంగీకరించాడు. మొత్తం 280 బస్తాలలో సుమారు 140 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ బియ్యం విలువ సుమారు రెండు లక్షల ఎనభై వేల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. పోలీసులు బియ్యం బస్తాలు, వాహనం స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. తూర్పాటి తిరుపతి, గడ్డం భాగ్యలక్ష్మి పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**పరకాల, ఏప్రిల్ 05, (ప్రజా జ్యోతి):** స్వతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని పరకాల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద విగ్రహ ప్రతిష్టపన వ్యవస్థాపక అధ్యక్షులు బొచ్చు అనంతరావు ఆధ్వర్యంలో భారతదేశ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి, సామాజిక సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేసిన పరకాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ జాతీయ నాయకుడు,స్వాతంత్ర్యసమరయోధుడు,సామాజిక న్యాయ పోరాట యోధుడు,అణగారిన వర్గాల పోరాట యోధుడు.. ఆయన గురించి మనం ఎల్లప్పుడూ ఆయన సిద్ధాంతాలతో ముందుకు సాగాలని కొనియాడారు. అనంతరం పండ్లు, స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల మండలం ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి,కౌన్సిలర్స్ బొచ్చు మాధవిలత జాన్సన్ బొచ్చు సుభద్ర సాల్మన్, పాలకుర్తి శ్రీనివాస్, బొచ్చు శ్యామల బాబురావు, సుధమల్ల రమేష్, పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్ ,బొచ్చు జెమిని, దుప్పటి సదయ్య, ఆయిలిపెల్లి స్వామి, బండి రాజు, బొచ్చు రాజు,జూపాక దేవమణి, రాజధాని టీ ప్యాలెస్ ఓనర్ రామన్న పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కౌన్సిలర్ పూర్ణ చారి



**పరకాల, ఏప్రిల్ 05, (ప్రజా జ్యోతి):** పరకాల పట్టణంలోని తొమ్మిదవ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొయ్యడ వేణు కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న స్థానిక వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి నిత్యవసర సరుకులు అందజేయడంతో పాటు ఆర్థికంగా సహాయం చేసి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా కష్టకాలంలో తోడుగా నిలిచిన కౌన్సిలర్ పూర్ణాచారికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అండగా నిలుస్తూ తన దయార్ద్ర హృదయాన్ని చాటుకుంటున్నారని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వేణు కుటుంబ సభ్యులు తండ్రి ప్రభాకర్, తల్లి స్వరూప,అన్న రాజు,నాగరాజు, రామగిరి సత్యం,మరియు పెగడ ధనుంజయ, దాసరి వెంకన్న,వావిలాల రవీందర్, దాసరి రవి, క్యాతం రమేష్, సంఘపురుషోత్తం, సంఘ నరేష్, సంఘ ప్రభాకర్, మంత్రి చక్రపాణి, పిట్ట అనిల్, శ్రీనివాస్, కూర శ్రీధర్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి ద్రాక్షను ఆశీర్వదించిన సోద

**పరకాల, ఏప్రిల్ 05, (ప్రజా జ్యోతి):** పరకాల మున్సిపాలిటీ 2వ వార్డు కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు లావణ్య – సంపత్ ల కుమార్తె ద్రాక్ష కి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోద రామకృష్ణ. వారితోపాటు నాయకులు బొచ్చు అనంత్, బొచ్చు జెమిని, ఏకు మనోజ్, బొచ్చు, రమేష్, బొచ్చు శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, బొచ్చు అఖిల్,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఈస్టర్ పండుగ



**పరకాల, ఏప్రిల్ 05, (ప్రజా జ్యోతి):** పరకాల పట్టణంలోని సి ఎస్ ఐ బెతెల్ ఆశ్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్ ఈస్టర్ పండుగను పురస్కరించుకొని కేకును పిల్లలతో కలిసి కట్ చేసి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసినారు. మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈస్టర్ పండుగ మృత్యుంజయుడు సందేశం అని, మానవాళికి నూతన ఉత్తేజమని, ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది హృదయాల్లో నిరీక్షణ దీపాలను వెలిగించే ఈస్టర్ పండుగని, మరణం పై జీవం సాధించిన అజేయ విజయమని, ఈస్టర్ పండుగ అత్యంత పవిత్రమైనదని, ప్రాముఖ్యత కలిగిన పండుగని ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో బేతేల్ ఆశ్రమం వార్డెన్ గీతా మేడం, పిల్లలు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు



**ధర్మసాగర్, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):** ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ, గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశ సేవలో చేసిన కృషి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పుట్ట ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబుజగ్జీవన్ రామ్ జయంతి



**ఆత్మకూరు /నీరుకుళ్ళ, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలో బాబుజగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నదునూరి రఘు మాదిగ, బాబు జగ్జీవన్ రావు కమిటీ అధ్యక్షులు అర్షం కుమార స్వామి, జూనియర్ లెక్చరర్ హర్షం జనార్ధన్, సోషల్ మీడియా మండల ప్రెసిడెంట్ ఉడుత రాజేందర్, కొంగరి ప్రశాంత హర్షం రాజేంద్రప్రసాద్ టీచర్ హర్షం దశరథం కొమ్ముల శరత్ మాజీ సర్పంచ్ అర్షం బలరాం, కొడపాక కుమార్ అర్షం మధుకర్, వంగేటి గోవర్ధన్ అర్షం సుధాకర్, నాగరాజు, పొనుగోటి సత్యనారాయణ, మహేందర్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు నీలం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**హసన్‌పర్తి,ఏప్రిల్ 5(ప్రజాజ్యోతి):** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా హసన్ పర్తిమండలం నాగారం గ్రామపంచాయతీలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ లావణ్య సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు అన్వర్ ముఖ్య అతిథులుగా హాజరై జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బూర్ణ సాయి, చేలువేరు విజయ, పోరెడ్డి సునీత రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చేలువేర్ అశోక్, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమ కారులను ఆదుకోవాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఏకగ్రీవం





**దామెర, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యమ కారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ కోరారు. ఆదివారం దామెర మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం ఆధ్వర్యంలో టీయూఎఫ్ దామెర మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూఎఫ్ మండల అధ్యక్షుడిగా పోలెపాక ఆరోగ్యం, ప్రధాన కార్యదర్శిగా గడ్డం సదానందం, ఉపాధ్యక్షులుగా కుంటమల్ల రాజు, మన్నెం ఇంద్రా రెడ్డి, తోట బాబురావు, ఇటికాల బాబురావు, బాగాది యాదగిరి, మిరాల రవి, కార్యదర్శి ఎన్ రెడ్డి నర్సింహారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో ముందుండి పోరాడిన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విదాలుగా అదుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో దామెరుప్పుల శంకర్, దామెర కుమారస్వామి. ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎండీ.బాబుమియా (చిరు), గోవిందు అశోక్, పెరుక సత్యం, గొల్లపెల్లి వేణు, మాజీ ఎంపీటీసీ నన్నెబోయిన కొమురయ్య, తోట, బాబురావు, ఇటికాల బాబురావు, కుంటమల్ల రాజు, బత్తిని ఓదేలు, పిడుగు పెద్దులు, సింగరబోయిన భిక్షపతి, వంగ లింగయ్య, బత్తిని రాజు, పిడుగు రవి, యాదండ్ల ఐలయ్య, మేరుగు మల్లయ్య, బత్తిని పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

- సిలువగుట్టపై ప్రత్యేక ప్రార్థనలు




**ధర్మసాగర్, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి)**:హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘ నంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని సిలువగుట్టపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, ఈ కార్యక్రమాన్ని చర్చ్ ఫాదర్ జోజి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ మేత్రాసన పాలనా అధికారి విజయపా ల్ రెడ్డి హాజరై యేసుక్రీస్తు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థ నలు చేశారు.ఈ సందర్భంగా శాంతి, సౌభ్రాతృత్వం, ప్రేమ సందేశాలను వి శ్వాసులకు తెలియజేశారు. ఫాదర్ జోజి బాబు మాట్లాడుతూ యేసుక్రీస్తు చూ పిన మార్గంలో నడుచుకుంటూ సమాజంలో ప్రేమ, సేవా భావం పెంపొందించుకోవాలని సూచించారు.విశ్వాసులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఫాదర్ ప్రవీణ్‌తో పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలే యువతరానికి స్ఫూర్తి..!

- అంబేద్కర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్
- ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**కమలాపూర్ ఏప్రిల్ 5 ప్రజా జ్యోతి** మహనీయుల ఆశయ సాధననే నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకొని వారి ఆకాంక్ష కోసం ముందుకు సాగాలని అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రజా సంఘాల నేతలు, ప్రజాస్వామిక వాదులు ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం మహనీయులు చేసిన సేవలు మరువలేనివని, దేశంలో అణగారిన వర్గాల కోసం బాబు జగ్జీవన్ రామ్ కృషి గొప్పదని ఇలాంటి నేతలు ఎంతోమంది దేశంలో నిమ్న జాతుల అభివృద్ధికి పని చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు పుల్ల కొమురయ్య, పుల్ల శోభన్ బాబు, అంబేద్కర్ సంఘం మండల కార్యదర్శి కొలుగూరి రాము, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు, పోడేటి బిక్షపతి,పాలకవర్గం సభ్యులు పుల్ల శ్రీనివాస్, జన్ను బిక్షపతి, పుల్ల ఐల య్య, మౌటం రమేష్, ఎమ్మార్పీఎస్ నేతలు చిలువేరు సంపత్, శనిగరపు రవీందర్, ఎంప్లాయిస్ యూనియన్ నేత పుల్ల శంకర్,రమేష్, సాయి, అన్వేష్, వంశీ,సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ముప్పారం గ్రామంలో పలు పనులకు శ్రీకారం



**ధర్మసాగర్, ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి ):**ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో ఆదివారం సర్పంచ్ గుంటిపల్లి రేణుక పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గ్రామంలోని ఐదు డ్రైనేజీలపై ర్యాంప్ పనులకు, విద్యుదీకరణలో భాగంగా రూ.5 లక్షల వ్యయంతో కొత్త విద్యుత్ స్తంభాలు, లైన్లు, మరమ్మత్తు పనులకు, అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు 8 చేతిపంపుల మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలన్నిటికీ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విలేజ్ క్యాబినెట్ ఏర్పాటు అనంతరం వార్డు సభ్యులు తమ తమ బాధ్యతల్లో నిమగ్నమవుతూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు పనులను ఆయా వార్డు సభ్యులకు కేటాయిస్తున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి గౌడ్, వార్డు సభ్యులు ఎత్తు రాజుల శోభారాణి, నరేడ్ల రాజేష్, వెల్దండి శ్వేతా సాగర్, గడ్డం గణేష్, కందుకూరి విజయ్ చందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కోతి సాంబరాజ్ గౌడ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికుడికి అండగా ఆంజనేయులు 5000 ఆర్థిక సహాయం



**లింగాల గణపురం, ఏప్రిల్, 5 (ప్రజాజ్యోతి ):**మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు ఉత్తమ కార్మికుల అవార్డు గ్రహీత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు 5000 ఆర్థిక సాయం అందజేశారు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు పోరాటాలకు కేంద్రంగా పనిచేసే సిపిఐ పార్టీని ఆదరించండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి



**ఎల్కతుర్తి ఏప్రిల్ 05 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామం లో సిపిఐ ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించిన సిపిఐ నాయకులు. భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని అంతరాలేని సమ సమాజం కావాలని బ్రిటిష్ సామ్రాజ్య వాదుల నుండి విముక్తి చేయుటకు సిపిఐ నాయకులు కార్యకర్తల పై కుట్రలు కేసులు పెట్టిన జైల్లో నిర్బంధించిన.. ఉరి తీసిన స్వతంత్రం పోరాటంలో అగ్ర భాగాన సిపిఐ పార్టీ నిలిచిందని దేశం లో స్వతంత్రం సంపాదించుకున్న తర్వాత బ్యాంకులు.. జాతీయ కారణ ఎల్ఐ సి రోడ్లు రైల్వే ప్రభుత్వ రంగంలో విద్యా వైద్యం కొనసాగాలని నినాదించినది సిపిఐ పార్టీ భూ సంస్కరణలు అమలు చేయాలని పేదలకు భూమి దక్కాలని దున్నేవానికి భూమి కావాలని పోరాటాలు నడిపి లక్షలాది ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి తెలిపారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి తెలంగాణలో స్వతంత్రం రాక నైజం కబందాస్తాల లో ప్ర జాస్వామ్యం స్వేచ్ఛ లేక భూస్వాముల దొరల గడిల పాలన కొనసాగుతూ భూ స్వాముల చేతుల్లో లక్షలాది ఎకరాల భూమి చేతిలో ఉంచుకొని ప్రజలను తీ వ్రంగా మానసికంగా ఆర్థికంగా ప్రశ్నించలేదు. మాట్లాడలేని హీనస్థితి ఉంది సిపిఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పిలుపునిచ్చి 10 లక్షల ఎకరాల భూమిని 3000 గ్రామాలను విముక్తి చేసి.4500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు నాయకులు తమ బలిదానం తెలంగాణ ప్రాంతంలో ప్రతి గ్రామంలో ప్రాంతంలో చరిత్ర ఆనవాళ్లు ఇంకా మిగిలి ఉన్నాయి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఏ పార్టీ మడమ తిప్పని నిర్ణయం తీసుకొని ఉద్యమాల పోరాటం చేసిందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి పెద్ద నోట్ల మార్పిడి రైతులకు ఆదాయం రెట్టింపు చేస్తామని నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి పౌరునికి 15 లక్షల రూపాయలు అందిస్తామని చెప్పి ఆకాశానంటే విధంగా ఉన్న 100 రోజులలో నిత్యావసర ధరలను తగ్గిస్తామని చెప్పి నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని తుంగలో తొక్కి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ వంశం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్న బిన్ను అయిందని కార్పొరేట్ రంగ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చేస్తుందని నిరుద్యోగం మరింత పెరిగి ధరలు దరిద్యం రైతుల అప్పులు వ్యవసాయ కూలీల జీవితం దుర్భరం ఉపాధి లేక ఇతర దేశాలకు వలసలు. ప్రజాస్వామ్యం కొంటుపడిందని విద్యా వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగే వాటిని నిర్వీర్యం చేస్తూ పేదవానికి విద్యా వైద్యం అందలేని స్థితి కొనసాగిందని.. రానున్న రోజుల్లో సిపిఐ పార్టీ ప్రజా ఉద్యమాలను పోరాటాలను ప్రజలు ఆదరించి సహకరించి విరాళాలు అందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలో పథకాన్ని వేగంగా ప్రజలకు అందే విధంగా చూడాలని పెండింగ్ లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టుగానికి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, కామెరా వెంకటరమణ, నిమ్మల మనోహర్, తండ మొండయ్య, మర్రి విజయ్, గ్రామ సర్పంచ్ కర్రే లక్ష్మి, సూర మొగిలి, మాధవరావు, గడ్డం లలిత, కర్రే రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సేవలకు గుర్తింపుగా రాష్ట్ర పదవి

- టిసిడిఎ స్టేట్ జాయింట్ సెక్రటరీగా పూర్ణచందర్ ప్రమాణ స్వీకారం
- ఘనంగా సన్మానించిన మెడికల్ యూనియన్ సభ్యులు






**వెంకటాపురం,ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి)**:ఏజెన్సీ మారుమూల ప్రాంత ప్రజలకు సుపరిచితుడుగా,గత 30 సంవత్సరాలనుండి వెంకటాపురం మండల కేంద్రంలో సత్యదేవా మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్న బచ్చు పూర్ణచందర్ మెడికల్ యూనియన్ ములుగు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఆయన సేవలకు గుర్తింపుగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆదివారం హైదరాబాద్ టీటీడీసీఏ భవన్ లో రాష్ట్ర,జిల్లా నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మృత్యుంజయ రెడ్డి పట్టు శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు.నూతన బాధ్యతలు స్వీకరించిన పూర్ణచంద్రావుకు ములుగు జిల్లా యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటాపురం మెడికల్ షాపుల యజమానులు బత్తుల నరహరి,ముస్తఫా,వంకాయల రమేష్,డిఎంఎల్ టి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ కు నివాళులర్పించిన ఏఎంసీ చైర్మన్



**వర్ధన్నపేట ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి**వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలో మరియు రాయపర్తి మండల కేంద్రంలో ఆదివారంబాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు ఎలీషా వెంకటయ్య దంపతులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడు తూ, దేశంలో ఒకప్పుడు దళితులపై తీవ్ర వివక్ష కొనసాగిన కాలంలో, జగ్జీవన్ రామ్ గారు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించి, కేంద్ర మంత్రిగా అనేక శాఖలను నిర్వహించడంతో పాటు రక్షణ మంత్రిగా కూడా సుదీర్ఘకాలం సేవలందించారని తెలిపారు. ఆయన ప్రతిభను గుర్తించిన పార్టీ ఉప ప్రధానమంత్రిగా నియమించిందని గుర్తుచేశారు.అలాగే ఆయన కుమార్తె ను కాంగ్రెస్ పార్టీ దేశంలో అత్యున్నత పదవుల్లో ఒకటైన లోక్‌సభ స్పీకర్‌గా నియమించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంలో ఆమె సంతకం కీలక పాత్ర పోషించిందని, ఇది చరిత్రలో నిలిచిపోయే సంఘటన అని అన్నారు. జగ్జీవన్ రామ్ గారు దళితుల ప్రాథమిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేతగా, అణగారిన వర్గాల హక్కులను కాపాడిన నాయకుడిగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. దాదాపు 40 సంవత్సరాల పాటు రాజకీయాల్లో కొనసాగుతూ, ఇండో పాక్ యుద్ధం 1971 సమయంలో దేశానికి విజయం సా ధించడంలో కీలక పాత్ర పోషించిన ఆదర్శ నాయకుడిగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ పాల్గొని, జగ్జీవన్ రామ్ గారి సేవలను స్మరించుకున్నారు.

## బాలికల ఆశ్రమ పాఠశాలను గురుకులం చేయాలి

- జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిదొర డిమాండ్



**వెంకటాపురం,ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి)** :చిరుతపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను గురుకులంగా మార్చాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు.ఆదివారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కొమరం భీమ్ కాలని ఆదివాసులతో సమావేశమైన సందర్భంగా సాయి మాట్లాడుతూ.. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలోని చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలను గురుకులం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఉన్నత చదువులు చదవలేక చాలామంది ఆదివాసి బిడ్డలు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదివాసులు ఉంటారు కాబట్టి వారు పదవ తరగతికి పరిమితం అవుతున్నారని, ఇంటర్మీడియట్ గురుకులం చేస్తే ఆదివాసీ బిడ్డలకు ఉన్నత విద్యకు తోడ్పాటుగా ఉంటుందని తెలిపారు. ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తుని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంకటాపురం చిరుతపల్లి 1గిరిజన ఆశ్రమ పాఠశాలను తక్షణమే గురుకులంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆదివాసి విద్యార్థులు పై చేయిగా నిలవాలని అన్నారు.ఈ సమావేశంలో తాటిల క్మయ్య. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 05 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆనాటి ప్రభుత్వం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమారికి స్పీకర్ పదవి ఇచ్చి సముచితంగా గౌరవించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. దేశానికి సేవలు అందించిన మహనీయులు విగ్రహాలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బీహార్ లోని చిన్న గ్రామంలో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ దేశానికి కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా తన అమూల్యమైన సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. నేటి తరాలకు డా బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శమని యువత ఆయన బాటలో పయనించి అభివృద్ధిలో మన జిల్లాకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ,మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఎస్సి అభివృద్ధి అధికారి ఇందిర, కౌన్సిలర్లు, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కమిటి సభ్యులు, బిసి సంగం నాయకులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**వర్ధన్నపేట ఏప్రిల్ 5 ప్రజాజ్యోతి**వర్ధన్నపేట మండలం కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడినాయి. వర్ధన్నపేట మహనీయుల మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాస్ అధ్యక్షులు జన్ను రాములు మాదిగ హాజరై మాట్లాడారు. దేశానికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలను స్మరించుకుంటూ, ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండలం మహనీయుల కమిటీ చైర్మన్ మారపెల్లి ఎల్లయ్య మాదిగ, వైస్ చైర్మన్ కంజర్ల మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మరుపట్ల అంజయ్య మాదిగ, ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, వర్ధన్నపేట మండలం ఎం పి ఎస్ అధ్యక్షులు ముత్యాల మల్లేశం మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు చాడ కరుణాకర్ మాదిగ, బిర్రు బిక్షపతి మాదిగ, మండల అధికార ప్రతినిధి, కట్ర్యాల గ్రామ శాఖ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ముత్యాల సులేందర్ మాదిగ, ముత్యాల సంజీవ మాదిగ, ఎర్ర ప్రేమ్ మాదిగ రాజ్, కొండేటి సంపత్ మాదిగ, రాజు మాదిగ, తుళ్ల రమేష్ మాదిగ, కొండేటి సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆయన ఆశయాలను కొనియాడుతూ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎస్ఆర్ఆర్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి ఏప్రిల్ 5 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భాషబోయిన సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూండగా వారిని హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో వారి బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

## మాల కుల పెద్దమనీషిగా పుట్టల వెంకటయ్య



**మహాముత్తారం,ఏప్రిల్ 5. ప్రజాజ్యోతి** ముత్తారం గ్రామం మాల కుల పెద్దమనీషిగా పుట్టల వెంకటయ్య ఏకగ్రీవంగా మాల కులస్తులు ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా లింగమల్ల శంకర్ మండల లక్ష్మయ్య మురుకుట్ల సంతోష్ లింగమల్ల మల్లేష్ మానేటి కృష్ణస్వామిలను ఎన్నుకున్నారు.

## పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడు బాబు జగ్జీవన్ రామ్



**వర్ధన్నపేట ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలో మరియు రాయపర్తి మండల కేంద్రంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూళ్ల రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తూళ్ల రవి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సమాజం కోసం, దేశం కోసం, ముఖ్యంగా పేదలు మరియు దళితుల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాడిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు.దళితుల హక్కుల కోసం, విద్యా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి వర్ణనాతీతమని తెలిపారు. తన చివరి శ్వాస వరకు ప్రజల సేవలో నిమగ్నమైన నాయకుడిగా బాబు జగ్జీవన్ రామ్ నిలిచిపోయారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరారపు నిరంజన్, పులి శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

- సర్పంచ్ కావిరి అర్జున్



**ఏటూర్ నాగారం, ఏప్రిల్ 05 ప్రజా జ్యోతి** మండలంలోని రొయ్యూరు గ్రామంలో ఆదివారంభారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని, మహనీయుల ఆశయాలను తూచా తప్పకుండా పాటించడమే వారికి మనం ఇచ్చే గొప్ప గౌరవమని సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సమతవాది, కార్మిక చట్టాల రూపకర్తగా దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు.భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో ఆయన పోరాటం అజరామరమని, అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర కార్మిక మంత్రిగా పనిచేసిన సమయంలో కార్మికుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి అనేక చట్టాలు తీసుకువచ్చి దేశ అభివృద్ధికి బలమైన పునాది వేశారని అన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలోనూ బలహీన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహనీయుల చూపిన మార్గంలో నడిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వారి జీవిత గాథ భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుదారి మహేష్ వార్డు సభ్యులు కొండగొర్ల తిరుపతి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దోంగిరి మందుబాబు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కొండగొర్ల పోషయ్య గ్రామ కమిటి అధ్యక్షులు కావిరి మండయ్య కొండగొర్ల నర్సయ్య మూలకాల శ్రీను కారోబార్ శంకర్ జాడి వెంకటేష్ ఆకుదారి రమేష్ దోంగిరి రాంబాబు గట్టయ్య తదితరులు పాలుగోన్నారు

# నేడు ప్రజావాణి గిరివాణి కార్యక్రమం

- గిరిజన దర్బార్‌లో ప్రజల అర్జీల స్వీకరణ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ఏటూరునాగారం, ఏప్రిల్ 05 ప్రజా జ్యోతి** ఏటూరు నాగారం మండల కేంద్రంలోనీ ఐటిడిఏ కార్యాలయం సోమవారంప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు (సోమవారం) ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయంలో ప్రజావాణి గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈసారి ప్రత్యేకంగా గిరిజన ప్రాంత ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏటూరునాగారంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు, గిరిజనేతరులు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు నేరుగా అధికారులకు సమర్పించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వయంగా వినాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూమి, ఆదాయం, పింఛన్లు, రేషన్, విద్య, ఆరోగ్య సంబంధిత సమస్యలకు తక్షణ పరిష్కారం లభించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను చేపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు

## జగ్జీవన్ రామ్ కి భారతరత్న ఇవ్వాలీ

- ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల డిమాండ్



**ఏటూరునాగారం ఏప్రిల్ 05 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ ఆవరణలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి మాదిగ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారతదేశ తొలి తరం ప్రముఖ నాయకుల్లో ఒకరని, స్వాతంత్ర సమరయోధుడిగా దేశానికి విశేష సేవలు అందించారని అన్నారు. బీహార్ రాష్ట్రం నుంచి కేంద్ర రాజకీయాల్లోకి వచ్చి సుదీర్ఘకాలం పాటు కార్మిక శాఖ మంత్రిగా, అలాగే ఇతర కీలక శాఖల్లో పనిచేసి గొప్ప అనుభవాన్ని సంపాదించారని తెలిపారు.కార్మికుల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలను తీసుకువచ్చి, దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేసిన మహానేతగా ఆయనను కొనియాడారు. ఉప ప్రధానిగా సేవలందిస్తూ నవభారత నిర్మాణంలో తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సమాజంలో అణగారిన వర్గాలపై జరుగుతున్న వివక్షతను నిర్మూలించేందుకు ఆయన నిరంతరం పోరాటం సాగించారని పేర్కొన్నారు.బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను గౌరవిస్తూ భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పురస్కారం అయిన భారతరత్న ప్రదానం చేయాలని ఎమ్మార్పీఎస్ మరియు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం ములుగు జిల్లా ఇంచార్జి వాసంపల్లి సాంబశివరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లంజపల్లి నరసయ్య మాదిగ, మండల ఇంచార్జి కర్నె రమేష్, గీకూరు భాగ్యమ్మ, మండల అధ్యక్షులు ఎంపల్లి జాషువా మాదిగ, పద్మశాలి సంఘం నాయకులు సంగెం గోపి, సీనియర్ నాయకులు దేపాక శ్రీరాములు, వావిలాల రామ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోలాసోమయ్య మృతికి నివాళులు అర్పించిన మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్

**రాయపర్తి ఏప్రిల్ 5 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలోకోలా నాగరాజు తండ్రి కోలా సోమయ్య ఆదివారం అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకర ఎలక్ట్రిక్ పోల్ పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

- సీసీ రోడ్ల పనులకు శ్రీకారం మంత్రి సీతక్కకు ప్రజల కృతజ్ఞతలు



**ఏటూరునాగారం ఏప్రిల్ 05 ప్రజా జ్యోతి** మండలం కేంద్రంలో రెండో వార్డులో పాత ఎలక్ట్రికల్ పోల్ విరిగి ఎప్పుడైనా కిందపడే ప్రమాదంలో ఉందని స్థానిక ప్రజలు తెలియజేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, ఆ పోల్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల భద్రత తమకు ముఖ్యమని, ఇలాంటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. గతంలో నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి సమస్యలు ఏర్పడ్డాయని, ఇకపై అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అలాగే గత బిఆర్ఎస్ పాలనలో బురదమయంగా ఉన్న రోడ్ల సమస్యకు ముగింపు పలుకుతూ, మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో రేపటి నుండి నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం లభిస్తుందని అన్నారు.స్థానిక ప్రజలు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామాభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలను అభినందించారు. సీసీ రోడ్ల నిర్మాణంతో రాకపోకలు సులభమవడంతో పాటు పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, శివాలయం చైర్మన్ మాడుగురి ప్రసాద్, టౌన్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఈరవేణి రామ్ లాల్, చెన్నం ఎల్లయ్య, ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నాళం సంపత్ కుమార్ ను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**రాయపర్తి ఏప్రిల్ 5 ప్రజా జ్యోతి**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిననాల్లం సంపత్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స తీసుకోని తన స్వగృహం హన్మకొండ 41 డివిజన్ విశ్వనాథ కాలనీ లో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా ఆదివారం వారిని పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు గా సంఘసంస్కర్తగా తన పరిపాలన దక్షతో అఖండ భారతానికి విశేష సేవలు అందించిన గొప్ప యోధుడు బడుగు బల హీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్గీవన్ రామ్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నమస్సుమాంజలి తెలియడం జరిగింది ఈ కార్యక్రమంలో చిలువేరు శంకర్ ఆలూరు రవి మండల యువత పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించినా బిఆర్ఎస్ నాయకులు



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** గణపురం మండల కేంద్రంలో తిప్పని అరుణాదేవి– కృష్ణమూర్తి గౌడ్ కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు ఈశ్వర్ గౌడ్ వర్ణిక లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన బిఆరెస్ నాయకులు ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు, బిఆరెస్ మండల అధ్యక్షులు మోతె కరుణాకర్ రెడ్డి,మాజీ సోసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి,మాజీ ఎంపీటీసీ మంద అశోక్ రెడ్డి, తెలంగాణ జాగృతి నాయకుడు కార్తీక్ గణపురం బిఆరెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు హాఫీజ్, జిల్లా యూత్ నాయకులు గాజర్ల చింటూ గౌడ్,తిప్పని వృశల్ గౌడ్,మార్క సాయి గౌడ్,వాజిత్,చక్రి తదితరులు పాల్గొన్నారు.

## గణపురం మండలం లారీ ఓనర్స్ నూతన కమిటీ ఎన్నిక



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** గణపురం మండలం లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులు గండ్రతి సురేందర్ గౌరవ అధ్యక్షులు అన్నం జగ్గారావు దాసరి సంపత్ లక్కం కుమార్ దేవిశెట్టి రామ కోటయ్య ఉపాధ్యక్షులు వీరమల్ల సురేష్ కార్యదర్శి పేరాల దేవేందర్ రావు కోశాధికారి యాశం హరిప్రసాద్ సహాయ కార్యదర్శి వేల్పుగొండ శ్రీనివాస్ సలహాదారులు అన్నం భాస్కరరావు పోల్ రాజేందర్ చెరుకు కుమారస్వామి కోల శ్రీశైలం బిల్లా దేవేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## రఘుకుల తిలకా పాట గాయకుడు కొండల స్వామికి సన్మానం



**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** గణపురం మండలం చెల్పూర్ గ్రామము లోని శ్రీరామదాసు భక్త మండలి వారి ఆహ్వానం మేరకు భద్రాచలం విచ్చేసిన గాయకుడు రఘుకుల తిలక పాటతో పాటు ఎన్నో భజన పాటలు పాడి తన గాన మాధుర్యంతో ప్రజలను భక్తి పరవశ్యంలో ఓలలాడిస్తున్న కొండల స్వామి ని శ్రీరామదాసు భక్తి మండలి వారు భద్రాచల దేవస్థానంలో ఆలయ ఈవో చేతుల మీదుగా వేద పండితుల సమక్షంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా కొండల స్వామి మాట్లాడుతూ తన గాత్రం ద్వారా దైవ సేవ చేసే అదృష్టం కలగడం పూర్వ జన్మ సుకృతమని ఆ సీతారామ చంద్రుల కృపతో తన గాత్రం సహకరించినంత వరకు మరిన్ని భక్తి పాటల రూపకల్పన చేస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రామదాసు భక్త మండలి సభ్యులు కొండల స్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తరిగొప్పలలో హిందూ సమ్మేళన సమితి కమిటీ ఎన్నిక



**తరిగొప్పుల ఏప్రిల్ 5 ప్రజాజ్యోతి :** తరిగొప్పులలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న హిందూ సమ్మేళనలలో భాగంగా, మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని హిందూ సమ్మేళనం కోసం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవాధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ అర్జుల జ్యోతి మధుసూదన్ రెడ్డి, అధ్యక్షులుగా మా శెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తిరుమలేష్, వెంకటేష్, చందూలాల్, జూమ్ లాల్, ప్రధాన కార్యదర్శులుగా ఆవుల శ్రీనివాస్, ఆవుల అంజయ్య, తాటి శ్రీనివాస్, నడిగోట్టు సతీష్, గాజుల యాదగిరి, ఏదునూరి కరుణాకర్, మహిళా కార్యదర్శులుగా అంజమ్మ, సుమలత, రమాదేవి, ప్రచార కార్యదర్శులుగా రాము, హరీష్, రజనీకాంత్, సభ్యులుగా రాజు, కొమురయ్య, మహేష్, సంపత్, కోశాధికారులుగా కౌడ లక్ష్మీ నారాయణ, గోలి సతీష్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి ఆచరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. హిందువుల ఐక్యతను చాటిచెప్పేందుకు ఇలాంటి సమావేశాలు అవసరమని, సమాజాభివృద్ధికి హిందూ ధర్మ రక్షణకు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. అధ్యక్షులు మా శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, యావత్ భారతదేశం సంఘటితంగా ఉండి దేశ పురోగతిలో ముందుకు సాగుతుందని తెలిపారు. మన ప్రాంతంలోని ప్రజలందరూ కులాలకు అతీతంగా ఒక్కటిగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, యువత హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ముందుండాలని, గ్రామ స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరు ఐక్యతతో ముందుకు సాగితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి



**కొడకండ్ల, ఏప్రిల్ 05 ( ప్రజాజ్యోతి ):** స్వతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని శ్రీ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా రామవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ గిరగాని క్రాంతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్ణకంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు కర్దూరి శివారెడ్డి, మచ్చ భూపాల్, సర్దార్ రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంతల సురేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నక్క సారయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడెల్లి సోమశేఖర్, బాల్నే మహేందర్, కార్తీక్ గౌడ్, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## "గ్రాండ్ గాలా" పేరిట సిల్వర్ క్రౌన్ హై స్కూల్‌లో అన్యువల్ డే వేడుకలు

- **ఆటపాటలతో అదరగొట్టిన విద్యార్థులు**
- **అధిక సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు**






**వరంగల్ సిటీ, ఏప్రిల్ 05(ప్రజాజ్యోతి):** విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదు, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వేదికలే వారి భవిష్యత్తుకు పునాది అనే విషయాన్ని మరోసారి సాక్షాత్కరింపజేస్తూ సిల్వర్ క్రౌన్ హై స్కూల్‌లో "గ్రాండ్ గాలా" పేరిట నిర్వహించిన అన్యువల్ డే వేడుకలు అద్భుతంగా, భావోద్వేగభరితంగా జరిగాయి. నగరంలోని రంగసాయిపేట తిమ్మాపూర్ క్రాస్ రోడ్ లో గల సిల్వర్ క్రౌన్ హైస్కూల్లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కేజీ నుంచి టెన్త్ క్లాస్ వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారుల చిరునవ్వులు, వారి అమాయకత్వం, స్టేజ్‌పై చూపిన ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకుంది. ప్రేక్షకులలో కూర్చున్న తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ కూచన కవిత మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెలికి తీయడం మా పాఠశాల లక్ష్యం" అని అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ వడ్డిచెర్ల ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువులోనే కాదు, సాంస్కృతిక రంగంలో కూడా ముందుకు రావాలని పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. మొత్తానికి "గ్రాండ్ గాలా" కార్యక్రమం విద్యార్థుల ప్రతిభకు ఒక గొప్ప వేదికగా నిలిచి, తల్లిదండ్రుల గర్వాన్నీ, గురువుల ఆనందాన్నీ ఒకేచోట కలిపిన స్మరణీయ వేడుకగా మారింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మరియు యాదగిరి శేఖర్ రావు, ఎన్ వెంకటేశ్వరరావు, బి ప్రసాద్, టి బుచ్చి బాబు, వి జనార్ధన్, ఎ వీరస్వామి, ఏ సాంబమూర్తి, బిల్లా రవి, టి జ్ఞానేశ్వర్ సింగ్, కోడెం శ్రీధర్, ఏ వెంకటేశ్వర్లు, కె రవి, కూచన క్రాంతి కుమార్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కోనాపురంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

- **యేసుక్రీస్తు పునరుత్థానం.. శాంతి సందేశంతో 'రన్ ఫర్ జీసస్'**




**చెన్నారావుపేట ఏప్రిల్ 5 (ప్రజా జ్యోతి)** లోక రక్షకుడు యేసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని కోనాపురం గ్రామంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు పునరుత్థానం మానవాళికి శాంతి, నిరీక్షణను ప్రసాదిస్తుందనే సందేశాన్ని చాటుతూ స్థానిక జేడీఈఎం బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్ ఎబినేజర్ నేతృత్వంలో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని చేపట్టారు. క్రీస్తు శాంతి సందేశాన్ని ప్రజలందరికీ అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ఆరాధనలో పాస్టర్ ఎబినేజర్ మాట్లాడుతూ.. ప్రేమ, సహనం, క్షమాగుణమే క్రైస్తవ ధర్మమని, క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో కొమ్మలు స్వామి, అశోక్, నగేష్, రాజు, భాస్కర్, అనిల్, రాజన్, మహేందర్, రాజేష్, మాణిక్యం, రవి, మల్లేశం, ప్రవీణ్, కార్తీక్, అఖిల్, ప్రశాంత్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రెయిన్బో యూత్ అసోసియేషన్ సాయం



**తరిగొప్పుల ఏప్రిల్ 5 ప్రజాజ్యోతి :** అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన పురామని రమేష్ గత వారం రోజులుగా అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిన అనంతరం, గ్రామానికి చెందిన రెయిన్బో యూత్ అసోసియేషన్ ఊపాధ్యక్షులు జొన్నగోని జొన్నగోని రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి 25 కేజీల బియ్యం తో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఊపా అధ్యక్షులు జొన్నగోని రవీందర్ మాట్లాడుతూ, కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడం ఎంతో దురదృష్టకరం. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. రెయిన్బో యూత్ అసోసియేషన్ ఎప్పుడూ మీకు అండగా ఉంటుంది, భవిష్యత్తులో కూడా మా వంతు సహాయం కొనసాగిస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి అధ్యక్షులు భోగం అనూప్ అంకం రాజు సభ్యులు గ్రామస్థులు మిండ్లపురం కర్ణాకర్ పాల్గొన్నారు.

## మండల స్థాయి టీ-10 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- ఈ నెల 10వ తేదీ నుండి క్రీడలు ప్రారంభం
- రూ. 10,016 ప్రథమ బహుమతి



**చెన్నారావుపేట ఏప్రిల్ 05( ప్రజాజ్యోతి ) :** నేటి సమాజంలో క్రీడలు శారీరక దారుఢ్యానికే కాకుండా, క్రీడాకారుల మధ్య ఐక్యతను మరియు స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని ఫ్రెండ్స్ యువజన సంఘం అధ్యక్షులు సింగిరెడ్డి అనిల్ పేర్కొన్నారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు.కాలనీకి చెందిన కీర్తిశేషులు బర్ల దేవదాసు జ్ఞాపకార్థం వారి కుమారుడు బర్ల శ్రీకాంత్ ఆర్థిక సౌజన్యంతో, ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి టీ–10 క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 10 నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 10,016/- ద్వితీయ బహుమతి రూ. 5,016/- లుగా తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...మండలంలోని క్రికెట్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 10వ తేదీ ఉదయం వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.పేర్ల నమోదుకై సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు సింగిరెడ్డి అనిల్: 8186065663,బర్ల కార్తీక్: 6281678563,సాధు సాత్విక్: 9392113946,నర్మెట ఈశ్వర్: 9866114226 లలో సాంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు సాధు నర్సింగరావు, మాజీ అధ్యక్షులు జంగిలి కిరణ్, మాధసి ప్రవీణ్, ఉపాధ్యక్షులు జంగిలి రాజేష్, బర్ల కార్తీక్, సతీష్, ఈశ్వర్, ప్రవీణ్, సాత్విక్, బింటు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర కోరారు.ఆదివారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర ఆరోగ్య వారోత్సవాల నిర్వహణకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజుల పాటు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

6న ఫుడ్ సేఫ్టీ ఆహార భద్రతపై దృష్టి పెట్టి ఆహార కల్తీ వల్ల వచ్చే జబ్బుల గురించి అవగాహన కలిగించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ఈట్ రైట్ వాక్ నిర్వహించా లన్నారు.

7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డి ఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు. 8న సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా వర్క్ షాప్ నిర్వహించాలని సూచించారు.

9న ఎయిడ్స్ అవేర్నెస్ రెడ్ రన్ వాక్ నిర్వహించి అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. 10న హోమియోపతి అండ్ ఆయుష్‌డే సందర్భంగా జిల్లా కేంద్రం లోని గిరిజన భవనంలో యోగా డెమానుస్ట్రేషన్ క్యాంపు నిర్వహించాలని అన్నారు. పేర్కొన్నారు. 11న డ్రగ్ నియంత్రణ విభాగం ద్వారా ప్రజలకు మందుల వినియోగంపై అవగాహన, డ్రగ్ అబ్యూస్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాన్నారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అంశాలను వివిధ విభాగాల బాధ్యతలను డిఎంహెచ్ఓ వివరించారు.

వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ ఆరోగ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీ,డిఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు,ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, డిఎస్పీ కిషోర్ కుమార్,డిపిఓ వెంకయ్య,డిఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డిఈఓ సిద్ధార్థ రెడ్డి,ములుగు మున్సిపల్ కమిషనర్ రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు..



**సంగెం, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలో భారత మాజీ ఉప ప్రధాని,బాబూజీ'గా పిలవబడే బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.మండల కన్వీనర్ మెట్టుపల్లి సునీల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పేర్ల లలిత రమేష్,ఉప సర్పంచ్ ఆగపాటి రాజు హాజరయ్యారు.వారు బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ... బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.1908 నుండి 1986 వరకు ఆయన జీవితం దేశ సేవకే అంకితమైందని,సుమారు 30 ఏళ్లకు పైగా కేంద్ర మంత్రిగా పనిచేసి,అత్యధిక కాలం మంత్రిగా ఉన్న వ్యక్తిగా రికార్డు సృష్టించారు.కార్మిక,రక్షణ,వ్యవసాయ శాఖ మంత్రిగా మరియు ఉప ప్రధానిగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు.గాంధేయవాదిగా,దళిత మరియు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గుండేటి బాబు సంగెం గ్రామ మాజీ సర్పంచ్,మెట్టుపల్లి శేఖర్ అంబేద్కర్ యువజన సంఘ అడక్ కమిటీ చైర్మన్,గుండేటి లవ కుమార్ మండల మాజీ కన్వీనర్,నాయకులు మల్లికార్జున్,కోడూరి సదయ్య,పులి వీరస్వామి,మెట్టుపల్లి అనిల్,ఇప్పకాయల గంగాధర్,మెట్టుపల్లి కుమార్,పులి సాంబయ్య,మహంకాళి మొగిలి,పులి రాజశేఖర్,కందగట్ల వెంకటేశ్వర్లు,గుండేటి ఏలియా,కేదాసీ సునీల్,తాటికొండ కిష్టయ్య, చిర్రా బాబు,బుచ్చిరెడ్డి,సంగయ్య,గుండేటి రాజు,కందగట్ల అనిరుద్, పేరాల పృథ్వీరాజ్,నంగునూరు శీను తదితరులు పాల్గొన్నారు

## బిజెపి జిల్లా అధ్యక్షుడి కుటుంబాన్ని పరామర్శించిన జీ.కే.రాంబాబు

**సంగెం,గీసుగొండ,ఏప్రిల్05(ప్రజాజ్యోతి):** బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి తండ్రి కొలను మధుసూదన్ రెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే..కాగా ఈ క్రమంలో,వారి కుటుంబ సభ్యులను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు ఆదివారం రోజున పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చి,పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలోజాలిగేపు ప్రసన్న రాం ప్రసాద్ 16వ డివిజన్ అధ్యక్షుడు,సంకతల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి,శంకర్ రాజు సీనియర్ నాయకులు,బూత్ అధ్యక్షులు రాజేష్,రాము తదితరులు పాల్గొ న్నారు. మధుసూదన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఈ సందర్భంగా నాయకులు కోరుకున్నారు.



## తాడిచెర్ల పీహెచ్సీని సిహెచ్సిగా మార్చాలి

- ఆర్టీఐ నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, కుమార్ యాదవ్


**ప్రజాజ్యోతి–మల్హర్ రావు.ఏప్రిల్ 05.** మండల కేంద్రమైన తాడిచెర్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆసుపత్రిగా మార్చాలని యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ వెంకట్టశ్వర్లు గౌడ్,కోకన్వీనర్ చింతల కుమార్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామూహిక ఆరోగ్య కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు.సిహెచ్ గా మార్చితే 24 గంటల వైద్యం అందుబాటులో ఉండే అవకాశం ఉందన్నారు.ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న క్రమంలో చేను, చెలక వద్ద పాము కాటుకు గురైతే వైద్యం అందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఎవరైనా పురుగుల మందు తాగిన ప్రాథమిక వైద్యం అందరి పరిస్థితి ఉందన్నారు.పీహెచ్సీగా అప్గ్రేడ్ చేస్తే తాడిచెర్ల మల్లారం పెద్దతుండ్ల చిన్నతుండ్ల దబ్బగట్టు దుబ్బపేటతో పాటు పలు గ్రామాల ప్రజలకు 24 గంటల వైద్యం అందుతుందన్నారు.మానేరుపై బ్రిడ్జి నిర్మాణం కావడంతో ఖమ్మంపల్లి, సందరెల్లి గ్రామాల ప్రజలు నిత్యం తరచులకు రాకపోకలు సాగిస్తున్నారని,వారు కూడా ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు పొందుతున్నారన్నారు.తాడిచెర్ల గ్రామంలో జనాభా పెరుగుతున్న దృష్ట, మైన్ కూడా సాగుతుండడంతో 24 గంటల వైద్యం అందుబాటులోకి తెస్తే ప్రజలకు మరింత మేలు కలగనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆటవిమార్గం లో తాడిచర్ల భూపాలపల్లి రోడ్డు పనులు పూర్తయితే రవాణా మరింత పెరిగి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది కాబట్టి ప్రస్తుతం 24 గంటల వైద్యం కోసం ఈ ప్రాంత ప్రజలు మహాదేవపూర్, భూపాలపల్లి లోని 100 పడకల ఆసుపత్రికి తరలి వెళ్తున్నారని తెలిపారు.పీహెచ్సీ ని సి హెచ్ సి గా అప్గ్రేడ్ చేస్తే నాణ్యమైన వైద్యం అందనుందన్నారు.



# భారతీయ జనతా పార్టీ ఒక సామాజిక శక్తి గా ఆవిర్భావం

ఏటూర్ నాగారం ఏప్రిల్ 5 ప్రజా జ్యోతి

భారతదేశ రాజకీయ పరిపాల నలో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న ప్రముఖ రాజకీయ పార్టీలలో భారతీయ జనతా పార్టీ ఒకటి మూలాలు బిజెపి మూలాలు 1951 శ్యాం ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన భారతీయ జన సంఘ్తో ముడిపడి ఉన్నాయి. జన సాంగ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ ఎస్) రాజకీయ విభాగంగా పని చేసింది. 1975 –77 అత్యవసరకాలంలో జన సంఘ్ లతో కలిసి జనతా పార్టీగా మారింది. ఆవిర్భవం 1977 ఎన్నికల్లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిలబడలేకపోయింది, దీనితో జన సంఘం నేతలు బయటికి వచ్చి 1980 ఏప్రిల్ 6, బిజెపిని స్థాపించారు. అటల్ బిహారీ వాజపేయి తొలి అధ్యక్షుడిగా, లాల్ కృష్ణ అద్వానీ కీలక పాత్ర పోషించారు. భారతీయ జనతా పార్టీ ప్రధానంగా జాతీయ వాదం, ఏకాత్మవాదం, హిందుత్వం పై ఆధారపడి ఉంటుంది. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ రూపకల్పన చేసిన పార్టీ సైదాంతిక పునాది ఇది వ్యక్తి సమాజా ఐక్యతను ఒకే ఆత్మగా చూస్తుంది. 1916 సెప్టెంబర్ 25న రాజస్థాన్లోని దన్ ఖీయ గ్రామంలో జన్మించారు.



గొప్పదార్శిణికుడు, ఇప్పుడు ఉన్నటువంటి మేకిన్ ఇండియాకు మూలాధారము ఇతని యొక్క ఆలోచనలే దేశం విదేశీ ఉత్పత్తుల పైన ఆధారపడకుండా సాధించాలని కలలుగన్న ఓ గొప్ప మేధావి. పేదలకు ముందుగా ప్రభుత్వ సాయం అందాలనేది ఇతని యొక్క ఆలోచన విధానం అందుకు అనుగుణంగానే ప్రణాళికను రూపకల్పన చేశారు. పంచానిష్టలే పార్టీనీ మూల స్థానంలో నిలబెడుతున్నాయి. బిజెపి తన మొదటి సమావేశంలో పంచ నిష్టలను ప్రకటించింది. జాతీయవాదం జాతీయ సమగ్రత ప్రజాస్వామ్యం. దోపిడీ లేని సమ సమాజం .సర్వ ధర్మ సమభావం . విలువ ఆధారిత రాజకీయాలు ఈ నియమాలే భారతదేశ అనే శక్తివంతమైన అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని వారసత్వాన్ని ప్రపంచానికి చాటాలని, రాజకీయ, ఆర్థిక,సామాజిక న్యాయాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది." సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ సబ్ కా విశ్వాస్ ప్రస్తుత సమాజానికి అనుగుణంగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంది. కాంగ్రెస్ పాలనలో భారత అభివృద్ధి చూసినట్లయితే నామమాత్రంగా టిడిపి ప్రకారం ప్రపంచంలో 10 వ ఆర్థిక వ్యవస్థగా ఉంది. కానీ బిజెపి పాలన ప్రారంభమైన తర్వాత 2024 నాటికి యూకే,ఫ్రాన్సులను దాటి ప్రపంచంలో నాలుగో పెద్ద ఆర్థిక శక్తిగా అవతరించింది అంటే బిజెపి భారత దేశ పేరు ప్రతిష్టలను వ్యాప్తి చేసేలా పరిపాలన అందిస్తున్న విధానాన్ని మనం ఈ వర్తమానంలో చూస్తున్నాం. భారతదేశ అని తన కబంధహస్తాలలో బంధించినబ్రిటిష్ సామ్రాజ్య ఆర్థిక శక్తిని దాటుకొని అన్ని రంగాలలో విశేషమైన అభివృద్ధిని సాధిస్తూ ఇప్పుడు భారతదేశ ముందుకు సాగుతుంది అంటే తిరుగులేని శక్తిగా ఎదుగుతుంది ప్రపంచంలో తన మాట చెల్లుబాటు అయ్యే విధంగా విదేశీ దౌత్యాన్ని నడుపుతుంది భారతీయ జనతా పార్టీ మూల సిద్ధాంతం ఆధారంగా పంచనిష్టలే మూల స్తంభాలై భారతదేశాన్ని గ్లోబల్ పవర్ గా నిలబెడుతుంది. ముందు దేశం తర్వాత నేను అనే నినాదంతో ముందుకు సాగుతుంది. విశ్వ యవనికపై తన సుశిక్షమైన పాలనతో సువర్ణ అక్షరాలను లిఖిస్తుంది రూడీ తో సహా మన కళ్ళ ముందు నిరూపిస్తున్నది భారత జనతా పార్టీ. దాదాపుగా 14 కోట్ల మంది సభ్యులతో బిజెపి నేడు ప్రపంచం అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలిచింది. ఈ మద్దతు పార్టీకి ఎన్నికల విజయన సాధించటమే కాకుండా సంస్థకు సామాజిక ఉద్యమ రూపాన్ని కూడా ఇచ్చింది. బిజెపి నాయకత్వం విధాన ఆధారిత అభివృద్ధి జాతీయ భద్రత స్వచ్ఛమైన పాలన భారత రాజకీయాల కు ప్రధాన ఆధారం చేసింది. భావజాలం సంస్థ మరియు సుపరిపాలన మిళితం చేయడం ద్వారా రాజకీయాలను అధికారాన్ని సాధించే సాధనంగా కాకుండా ప్రజాసేవ సాధనంగా మార్చింది నేడు భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా సమర్థవంతమైన సైనిక శక్తిగా మరియు నిర్ణయాత్మక నాయకత్వం కలిగిన దేశంగా ప్రపంచం చూస్తుంది బిజెపి పార్టీ విధానాల వల్లనే.. **డాక్టర్ మైపతి సంతోష్ కుమార్**

# ఖర్బూజా యొక్క ముఖ్య ఆరోగ్య ప్రయోజనాలు

**ఖర్బూజా (పుచ్చకాయ) అనేది విటమిన్లు ఎ మరియు సి, పొటాషియం, మరియు యాం టీఆక్సిడెంట్లతో నిండిన, అధిక తేమను అందించే ఒక పోషక-సాంద్రత గల వేసవి పండు. దీనిలో తక్కువ కేలరీలు, అధిక ఫైబర్, మరియు అధిక నీటి శాతం (సుమారు 90%) ఉండటం వలన,ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది, జీర్ణక్రియకు సహాయపడుతుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుం ది, చర్మ ఆరోగ్యానికి తోడ్పడుతుంది, మరియు బరువును అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది.**



### ఖర్బూజా యొక్క ముఖ్య ఆరోగ్య ప్రయోజనాలు:

**ఉత్తమమైన ఆర్ద్రీకరణ:** ఇందులో 90% నీరు ఉండటం వల్ల, ఇది కోల్పోయిన ద్రవాలను మరియు ఎలక్ట్రోలైట్లను తిరిగి అందించి, వేడి వాతావరణంలో శరీరాన్ని ఆర్ద్రంగా మరియు చల్లగా ఉంచుతుంది.

**గుండె ఆరోగ్యం:** ఇందులో రక్తపోటును నియంత్రించడంలో సహాయపడే పొటాషియం, మరియు రక్తాన్ని పల్చబరిచే గుణాలు కలిగి, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించే అడినోసిన్ ఉంటాయి.

**జీర్ణక్రియ మరియు పేగు ఆరోగ్యం:** ఇందులో అధికంగా ఉండే పీచుపదార్థం సరైన మలవిసర్జనకు సహాయపడి, కడుపు ఉబ్బరాన్ని తగ్గించి, మలబద్ధకాన్ని నివారిస్తుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:** విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది, విటమిన్ ఎ ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది.

**చర్మ మరియు జుట్టు ఆరోగ్యం:** విటమిన్ ఎ, బీటా-కెరోటిన్ మరియు విటమిన్ సి జుట్టుకు అవసరమైన సెబమ్ ఉత్పత్తిని ప్రేరేపించి, చర్మ స్థితిస్థాపకతను ప్రోత్సహిస్తూ, అకాల వృద్ధాప్యాన్ని తగ్గిస్తాయి.

**బరువు తగ్గడానికి సహాయకారి:** ఇం దులో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉం డి, కడుపు నిండుగా అనిపిస్తుంది కాబ ట్టి, బరువు తగ్గించే ఆహార ప్రణాళికకు ఇది ఒక అద్భుతమైన అదనపు పోషకం.

**కంటి ఆరోగ్యం:** ఇందులో అధికంగా ఉండే విటమిన్ ఎ మరియు కెరోటినాయిడ్లు కంటి కండరాలను బలపరిచి, శుక్లాలను నివారించడంలో సహాయపడతాయి.

**గర్భం మరియు రోగనిరోధక శక్తి:** గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఫోలిక్ యాసిడ్ను అందించి, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.

**విత్తనాల ప్రయోజనాలు:** ఖర్బూజా విత్తనాలు అత్యంత పోషకమైనవి. వీటిలో ప్రోటీన్, ఫైబర్ మరియు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి, ఇవి గుండె మరియు చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### పోషక విలువ (100 గ్రాములకు):

**నీరు:** ~90 గ్రాములు

**కేలరీలు:** ~34 కిలో కేలరీలు

**విటమిన్ ఎ:** ~3382 IU (రోజువారీ అవసరంలో 68%)

**విటమిన్ సి:** ~36.7 మి.గ్రా (రోజువారీ అవసరాలలో 61%)

### ముఖ్యమైన జాగ్రత్తలు:

**అతిగా తినడం:** ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, ఉబ్బరం లేదా కడుపు నొప్పి రావచ్చు.

**మధుమేహం:** దీనికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్నప్పటికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని మితంగా

**మూత్రపిండాల సమస్యలు:** ఇందులో పొటాషియం స్థాయిలు అధికంగా ఉండటం వల్ల, మూత్రపిండాల సమస్యలు ఉన్న వ్యక్తులు దీనిని జాగ్రత్తగా తీసుకోవాలి.

# ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** భారత మాజీ ఉప ప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆదివారం షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద గల ఆయన విగ్రహానికి మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పూలమాల వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. అదే విధంగా ఏసీపీ పండరి చేతన్ నితిన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు, షెడ్యూల్డ్ కులముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు కూడా డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

# నాడు ఒకే బడి..నేడు ఒకే చోట..ఒక్కటైన తిమ్మాపురం మిత్రులు..!



**సంగెం,ఏప్రిల్05(ప్రజాజ్యోతి):**మండలంలోని తిమ్మాపురం గ్రామంలో [1994-95]బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఉత్సాహంగా జరిగింది.దశాబ్దాల క్రితం విడిపోయిన మిత్రులంతా ఒకే వేదికపైకి చేరడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.మిత్రులంతా కలిసి సామూహిక విందు ఆరగించి,ఆటపాటలతో అలరించారు.తాము ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఈ పాఠశాల మరియు ఇక్కడి గురువులేనని వారు భావోద్వేగానికి లోనయ్యారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పూర్వ విద్యార్థులు పున్నం సతీష్,వాసం నరేష్,వేల్పుల రవి,కాగితాల రమణచారి,రామచంద్రు,రాజమౌళి,రాజేందర్,విజయలక్ష్మి ,అనిత,స్వరూప,అనురాధా,రజిత, రమాదేవి,రాణి,అనిత,సవిత,తదితరులు పాల్గొన్నారు.

# యువజ్యోతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేరిపెల్లి రాజు ఎన్నిక



**చెన్నారావు పేట ఎప్రిల్ 5 (ప్రజా జ్యోతి)**మండలంలోని పాత ముగ్ధంపురం గ్రామంలో యువ జ్యోతి యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత రెండేళ్లుగా అధ్యక్షుడిగా కొనసాగిన గద్దల ప్రశాంత్ పదవీ కాలం ముగియడంతో, గ్రామ ఉపసర్పంచ్ మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు.అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా చేరిపెల్లి రాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా సుంకరి రాజు,ప్రచార కార్యదర్శిగా సదిరం రాజు లను నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చేరిపెల్లి రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు, గ్రామ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం యొక్క నియమ నిబంధనలకు లోబడి, అందరినీ కలుపుకుంటూ గ్రామాభివృద్ధిలో యువత పాత్రను చాటుతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.